వృశ్చిక మాంత్రికుడు

*

ఆర్.వి.జి

పశుపతి బాబాయి మనోవ్యధకు గుర్యైనాడు. అందుకు చిహ్నంగా ఆయన గడ్డం గీచుకోడం మానేశాడు. భోంచేస్తూనే తనకేమీ సహించడం లేదంటున్నాడు. ఒంటరిగా మంచం మీద కూర్చుని శూన్యంలోకి చూస్తూ కాలం గడుపుతున్నాడు. శూన్యంలోకి చూచేందుకు వీలుగా మంచాన్ని కిటికీకి ఎదురుగా వేసుకొని తల క్రింద రెండు దిండ్లు గూడా వుంచుకున్నాడు. ఆయన ఏదో అసహనంతో బాధ పడుతున్నట్లు నలుగురికీ తెలిపేటందుకెన్నో తంటాలు పడతున్నాడు. అయితే నేను మాత్రం " ఎందుకీ మనోవ్యధ బాబాయ్ " అని అడగలేదు. అలా అడిగి, ఆ తర్వాత బాబాయి వాక్ప్రవాహాన్ని అడ్డగించగల శక్తిగానీ, ఆయన హిరణ్యాక్షవరాలను తీర్చగల సామర్థ్యము గానీ నాకు లేవు.

అయితే బాబాయి వాలకం చూసి నిజంగా దిగులుపడ్డ తల్లి మాత్రం నాకు చెవిలోని జోరిగే అయింది. ఆమె అభీష్టం ప్రకారం బాబాయి ఏ కారణం చేత యింత దిగులు పడ్డాడో తెలుసుకో వలసిన బాధ్యత నాపై బడ్డది.

" బాబాయ్ — నీ కెందుకీ మనోవ్యధ ? తిన తిండి, కట గుడ్డాలేని వాడికిమల్లే ఇదేమిటీ — గడ్డం పెంచావ్, దుస్తులు మార్చడం లేదు, మెతుకు నోట్లో బెట్టడం మానేశావ్ ? (ఆయన ముద్దలే నోట్లో కుక్కుకుంటాడు) — ఎందుకు నీకీ వ్యధ ? చెప్పు నీకథ — బాబాయ్ — చెప్పవూ" చిన్నపిల్లాడిని బుజ్జగిస్తూన్నట్టుగా అడిగాను నలభై ఏళ్ళ బాలాకుమారుడ్ని.

" నీతో చెప్పుకునేం లాభం ? నువ్వేం అర్చే వాడివా, తీర్చేవాడివా ? " నిష్ఠూరంగా మాసిన గడ్డాన్ని అరచేత్తో రాస్తూ అన్నాడు.

అంతటితో నా బాధ్యత తీరిన వాడినై వెళ్ళి పోతూ ఒకసారి వెనక్కి తిరిగి చూచాను. నేను అప్పుడే అలా వెడతానని బాబాయి వూహించ లేదు. ఇంకాస్సేపు నాచేత ప్రతిమాలించుకుని, అభయాలూ వాగ్దానాలూ, పుచ్చుకుని తన కోరిక వెలిపుచ్చాలని అనుకున్నాడేమో, నేను వెళ్ళడం దిగాలుగా చూస్తూ కూర్చున్నాడు.

ఆ తర్వాత బాబాయి జీవితంలో మరోమూడు రోజులు నిస్సారంగానే గడిచాయి. కాఫీ త్రాగుతున్న వాడు వున్నట్టుండి " నీతో అర్జంటుగా మాట్లాడాలి గదిలోకి రా " అన్నాడు. బామ్మ ముఖంలో మళ్ళీ తన కొడుకు మనుష్యుల్లో పడుతున్నంత ఆనందం వెల్లివిరిసి చాటంత ముఖం చేసుకుని " వెళ్ళా — వెళ్ళు " అని తొందర చేసింది.

తీరా నేను వెళ్ళేసరికి ఆయన శూన్యంలోకి గాక గోడవైపు తిరిగి పడుకున్నాడు. పురిటికి పుట్టింటికి వెళ్ళిన భార్యను చూడాలని బాబాయికి బుద్ధి పుట్టడం గత రెండు మూడు దఫాల్లోనూ జరిగి అమ్మేమను కుంటుందో అని నాచేత అడిగించాడు. అలాంటిదేదో అనుకున్నాను.

" బాబాయ్ " అన్నాను. పలకలేదు. కదలలేదు. కాస్సేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

" నే వెడుతున్నా " అన్నాను ఇక భరించలేక.

" ఒరేయ్. వుండరా. నీకూ నేనింత అలుసై పోయానుట్రా ? " అన్నాడు. బావిలోంచి వచ్చి నట్టుంది అతని స్వరం.

అయితే అర్థమైంది. ఎవరో బాబాయిని ఎగతాళి పట్టించి ఏడిపించారు. నేనెన్నోసార్లు చెప్పాను — యీ రోజుల్లో ఎవడి మానాన వాడు గప్ చుప్‌గా వుండి పోవడం కన్న సబబైన కార్యం ఏదీలేదు బాబాయ్ — అని. ఆయన వింటేనా ? వూళ్ళో నీటి పారుదల తగాదాల మొదలు ఆలూ మొగుడూ మధ్య తగూల వరకూ తీర్చేందుకీయనే తయారవు తాడు. ఆ తగాదాలన్నిటినీ ఆయనే పరిష్కారం చేసి ఆ మధ్య వ్యక్తిత్వంలో తాను అనుసరించిన న్యాయ సూత్రాలను నలుగురికీ చాటి తానో గొప్ప న్యాయ నిర్ణేతగానూ, అనుభవజ్ఞుడైన వ్యవహర్తగానూ పేరు గాంచాలని వుబలాటం. కాని ఇంతవరకూ ఆవూళ్ళో ఆయన సలహాను పాటించిన వ్యక్తే లేడు. పోగా, ఇరు పార్టీలనుండి మాట పడేది మాత్రం బాబాయే ! ఆ గ్రామానికి ఆయన ఏ మర్యాద రామన్నో, లేక ఏ సాలమన్ రాజో కావాలనుకుని ముచ్చటెచ్చు కుంటాడు.

అలాంటిదేదో జరిగి వుంటుందను కున్నాను.

" అయితే మళ్ళీ ఎవరి తగాదాల్లో తల దూర్చావ్ బాబాయ్ ?"

" తగాదా లేదూ గాడిద గుడ్డూ లేదు. నా జీవితమే నా పాలిట తగాదా ! యీ తగాదా తీర్చేందుకు ఆ సర్వేశ్వరుడ్ని మించిన న్యాయమూర్తి లేడు —."

సరళంగా మాట్లాడక డొంక తిరుగుడుగా కాస్త వేదాంత ధోరణిలో మాట్లాడటం ఆయన దృష్టిలో లౌక్యం — వివేకమూ ! " బాబాయ్. డొంక తిరుగుడుగా మాట్లాడక నువ్వు చెప్ప దలచుకున్నదేదో సూటిగా చెప్పు. నాకవతల పనుంది."

" ఒరేయ్. మనిషికి పేరు ప్రఖ్యాతులూ, కీర్తి — ప్రతిష్టలూ వచ్చి నలుగురి దృష్టిలో అతని విలువ, స్థాయి, గౌరవం పెరగాలంటే ఎలాగరా ? బాబ్బాబూ కొంచెం ఆ విషయాలేవో చెప్పి పుణ్యం కట్టుకోరా." అన్నాడు జాలిగా, దీనవదనంతో.

"పూర్వం శిబి చక్రవర్తి, కర్ణుడిలాగా దాన ధర్మాలు చెయ్యవచ్చు. కందుకూరి వీరేశలింగం పంతులు, రాజా రామ్‌మోహనరాయ్‌ల్లాగా సంఘ సేవ చెయ్యవచ్చు! గాంధీజీ, నెహ్రూల్లాగా దేశ సేవా చెయ్యవచ్చు ..... ఇంకా ఎన్నో వున్నాయి."

"దానధర్మాలు చేసేందుకు మనకు ఎవరైనా ఇస్తే పుచ్చుకో గలమే గాని ఒకరికి ఇవ్వగల శక్తి లేదుగదా! సంఘ సంస్కరణ, దేశసేవ ఇలాంటివి ఇప్పుడు ప్రారంభించి మనసేవ నలుగురిచేత గుర్తింప బడేప్పటికి ఈ జీవితమే పరి సమాప్తి మవుతుంది గదా! ఇంకేమైనా తేలిక మార్గాలూ, సులభోపాయాలూ వుంటే చెప్పరా అబ్బాయ్."

బాబాయికి పట్టుకున్న పిచ్చి నా కర్థమైంది. ఇప్పుడాయనో సరికొత్త అవతారం దాల్చేందుకు సిద్ధమవుతున్నాడు.

"తేలిక మార్గాలంతగా లేవు. రాజకీయుల్లో ప్రవేశించడం మేలు."

"రాజకీయాలన్నావూ — అవి నాలో ఎప్పుడూ ఒక భాగమే! గత రెండు ఎన్నికల్లోనూ నేను ప్రచారం చేసిన వ్యక్తులు ధరావత్తు కోల్పోయారు. వారు మూలబడ్డారు. మనకు ప్రోత్సాహం లేదు. గ్రామ రాజకీయాల్లోకి పిల్లకారు వచ్చి చేరుకుంది. కనీసం పంచాయతీ బోర్డులో మెంబరునవ్వా లన్నా అవ కాశం వాక్కానిపించడం లేదు రా బాబూ — కని పించడం లేదు." మనసులో గూడుకట్టుకున్న ఆవేదన అంతా వెలుపలికి కక్కేస్తున్నట్టుగా అన్నాడు.

"సరే బాబాయ్ — నేను బాగా ఆలోచించి నీకు సులభ మార్గాన పేరొచ్చే వుపాయం చెబుతాను. నువ్వు నిశ్చింతగా వుండు. ముందు మంచం వదిలి శుభ్రంగా తయారుగా" అని బయటి కొచ్చాను. బాబాయి ముఖమండలాన వెయ్యిదీపాలు వెలిగాయి. సంతోష వదనంతో నన్ను సాగనంపేందుకు వెంట వచ్చిన బాబాయిని చూచి వాళ్ళ అల్లి నా ప్రభావానికి మెచ్చుకుంది కాబోలు "ఒరేయ్ — వేణూ! నీ కిష్టమైన చిత్రాన్నం వండుతాను వారుగా — ఈ పూట ఇక్కడికే రా భోంచేద్దువు గాని" అన్నది.

"బామ్మా! ఇలా చీటికీ మాటికి లంచం ఆశ పెట్టడం ఆరోగ్యకరమైన లక్షణం గాదు. ప్రభుత్వానికి తెలిస్తే శిక్ష తప్పదు." అంటూ గడప దాటాను. "నా విషయం మరచిపోకురోయ్" అని బాబాయి వెనకనుంచి కేకేశాడు.

బాబాయికి మాటిచ్చానే కాని నేను మాత్రం ఏం చెయ్యను? ఏమని చెప్పను? ఆయనకి ఆసక్తి కలిగించని విషయం ఈ ప్రపంచంలో లేదు. కోర్టు వ్యవహారాలూ, భారీ ఎత్తున వ్యాపారాలూ సాగించి వాటిల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకుని వదిలేశాడు. ఆయన పేరూ, పైకమూ పుష్కలంగా లభ్యమయ్యేందుకు ఏమార్గమైనా అనుసరిస్తాడు. అయితే దేన్లోనూ ఓర్పుతో వ్యవహరించడు. కోర్టు వ్యవహారాలు ఒక్కమాసంలోగా తన కనుకూలంగా పరిష్కారమై మంచి ఆస్తిని తన వశం చేసుకోవాలను కుంటాడు. ప్రారంభించిన వ్యాపారంలో అధికారులు, అనధికారులూ తనకు ప్రసన్నమై ఒక నెలరోజుల వ్యవధిలోనే పెద్ద కోటీశ్వరుడ్ని చేయాలను కుంటాడు. అలా జరగనినాడు వ్యధా, దిగులూనూ! సులభ మార్గాన లక్షలార్జించేందుకు అనువైన లాటరీల్లో ఆయన తగిలేసిన, నేనున్న డబ్బులో ఇద్దరు కుమార్తెలనూ వైభవంతో మరో ఇంటి కోడళ్ళుగా చేసి వుండేవాడు. కాని, ఆ మార్గంలో ఆయనకు పోవడమే గాని వచ్చింది ఇదిగో అని కనీసం ఒక్క నయా పైసా అయినా చూపలేదు.

"ఇదంతా పిచ్చి పశుపతి! కష్టపడి సంపాదించా లిగానీ, అడ్డుదారిన స్వర్గం చేరిన వాళ్ళను ఎవరినైనా ఎరుగుదువా?" అని ఎవరైనా అంటే ఎప్పుడు ఏవీ లాటరీల్లో రైల్వే పోర్టరు గంగూలీకి, బస్సు క్లీనరు సులేమాన్‌కూ, దోసలమ్మే తాయారమ్మక్కూ, బడిపంతులు లక్ష్మీపతికీ లక్షలొచ్చి పడ్డదీ వివరిస్తాడు.

రాజకీయాలు తన అభిమాన విషయమనీ, ఎన్ని కల్లో తాను ఎలాంటి వ్యూహాలు పన్ని, ప్రత్యర్థుల గుండెల్లో బాకు పెట్టుకుని ఎలా కూర్చున్నదీ వివరించి — అదృష్టం లేదు కాబట్టే ఆ అభ్యర్థులు ధరావత్తుకు కూడా నోచుకో లేదని చప్పరించేస్తాడు.

"ఈనాటి గొప్పవాళ్ళు పూర్వాశ్రమంలో మామూలు వ్యక్తులే! అయితే గాంధీజీ సత్యాగ్రహ సమరం నాటికి వాళ్ళంతా రాజకీయాల్లో దూకేందుకు వారి తలిదండ్రులు అలాంటి వాతావరణాన్ని కల్పించారు. అందువల్ల ఈనాడు వాళ్ళంతా పెద్దవాళ్ళై నారు. పేరు, కీర్తి, గౌరవం దక్కించుకున్నారు. నేనూ గాంధీజీ పిలుపు నందుకుని వెళ్ళాలని వుబలాట పడి రైలుచార్జీకి డబ్బడిగితే మానాన్న చావబాది, చితకతన్ని, కాళ్ళూ చేతులూ కట్టి గదిలో పడేశాడు. లేకుంటే ఈ పరికి ఏ మంత్రినో అయుండే వాడ్ని." ఇలా రోజూ చెప్పిందే చెప్పి పదిమంది ఎదుటా వాపోయి వూరి వాళ్ళకు మంచి కాలక్షేపం కల్పిస్తుండే వాడు బాబాయి.

ఇప్పుడు అలాంటి బాబాయిని ఇరవైనాలుగ్గంటల్లో గొప్పవాడ్ని చేసి, అతడి విలువనూ, స్థాయినీ పెంచేయడం ఎలా సాధ్యమో నా కర్థంగాలేదు.

* * *

దిబ్భపుల్లలు అమ్మవద్ద ఇచ్చిన పురోహితుడు మర్నాటి సూర్యగ్రహణ విశేషాలు వుటంకిస్తుంటే నాకో విషయం జ్ఞాపకం వచ్చింది.

పాము కాటుకు వైద్యవిద్యలో మహో మహో డిగ్రీలు పొందిన డాక్టర్లకంటే పాముల నరసయ్య ఎన్నోమైళ్ళ దూరంనుంచి టెలిఫోనులోనే వైద్యం చేయడం, మందు మాకులకంటే మిన్నగా ఒక చిన్న మంత్రంతో తేలుకుట్టిన బాధ మాయమవడం, అనేక నొప్పులు, బాలగ్రహదోషాల్లాంటివి మంత్రాలకు లొంగడం అందరికీ తెలిసిన విషయాలే!

అయితే ఈ మంత్రోపదేశం, సిద్ధిపొందిన గురువు సముద్రతీరాన, గ్రహణ సమయాన చేయాలి. మరి బాబాయి గూడా ఇలాంటి మంత్రగాడైతే పేరు ప్రఖ్యాతులు రావడానికి సందేహం లేదు. పైగా ఇది తేలిక, చవుక గూడాను! వెంటనే మూడు మైళ్ళదూరాన ఆశ్రమంలో వున్న స్వాముల వారిని కలుసుకున్నాను. పాము కాటుకు మంత్రం మా బాబాయికి వుపదేశించమని ప్రాధేయపడ్డాను. వారు అంగీకరించడం బాబాయి అదృష్టమే మరి!

కాని బాబాయిని సముద్రానికి ప్రయాణం చేయడం మాత్రం సులభమైన పనిగా కనిపించలేదు. నాకు దరి బాబోయ్ అన్నాడు. నల్లగా భయంకరంగా మోతబెట్టే సముద్రాన్ని అసలు చూడలే నన్నాడు. "అలలు లాక్కుపోతాయి. మొసళ్ళు మింగేస్తాయి. నేను రాను. రానే రాను" అని మొరాయించాడు.

ఎలాగో బాబాయిని బతిమాలి, భంగపడి, చిన్ని పాపకు చందమామను చూపిస్తూ వేలిబువ్వ పెట్టినట్టు, గౌరవం, కీర్తి, ప్రతిష్ఠ అన్నీ కలిసి కను చూపు దూరంలోనే వున్నాయని ఆశపెట్టి ఒప్పించాను. మాకో బండినీ, స్వాముల వారికి ప్రత్యేకంగా మరో బండినీ ఏర్పాటు చేశాను. బాబాయి చేతులు మునగా షర్టు వేసుకుని, దానిపైన వున్న స్వెట్టరు తొడుక్కుని, తలకో మప్లరు చుట్టి, అప్పుడే హాస్పటల్‌లో డిస్చార్జి అయిన రోగిలాగా కనిపిస్తున్నాంటే వాళ్ళ తల్లేమో కనుకొలకుల్లో నీరు నిండగా, కొడుకు యుద్ధానికే వెడుతున్నట్టుగా, ఇక తిరిగేరానట్టుగా వీడ్కోలిచ్చింది.

గేటు వరకూ నడిచి వచ్చిన బాబాయి, మరొక్క

అడుగు వేస్తే జంకిగెంతుకునే బాబాయి, అటాయిన వెనక్కి తిరిగి 'అమ్మా' అంటూ పరుగెత్తాడు.

"అమ్మా. లక్ష్మీ, పిల్లలూ జాగ్రత్తమ్మా. ఆ గురవయ్య ఇవ్వాల్సిన ధాన్యం మరచిపోకు. బాబును తాళ్ళూరి చదివించమని లక్ష్మీతో చెప్పు. బుల్లెమ్మాయికి, చిట్టి తల్లికి మంచి సంబంధాలు తగాడు" అన్నాడు.

"అలాగే నాయనా. నువ్వు క్షేమంగా వెళ్ళిరా. సముద్రం చాలా లోతు. జాగ్రత్తగా చూచిదిగు. ఒరేయ్ వేణూ, అబ్బాయి జాగ్రత్త." ముస లామె కన్నీళ్ళు తుడుచుకుంటూ పైకి పొంగి వచ్చే దుఃఖాన్ని పెదలతో నొక్కిపెడుతూ అంది.

ఈ పన్నివేశాన్ని చూస్తూంటే నాకు చిరా కెత్తుకొస్తూంది. బలవంతాన పెళ్ళాన్ని లాక్కు పోతూన్న దుర్మార్గుడైన భర్తను చూస్తున్నట్టు, నన్ను మింగేసేట్టు చూస్తూంది బామ్మనాకేసి.

"నీ మానాన నువ్వుండిపో బాబాయ్. నువ్వు పుట్టి సిరిగలవాడివి. నీకు కీర్తి, పేరూ ఏమి కాదు—ఫో" అందామనిపించింది. కాని ఇంత వేషం తర్వాత ఇలా దాటేస్తే బాబాయి ఆత్మహత్య ప్రయత్నాలు బాహాటంగానే చేయగలడు.

రథం కదిలింది.

ప్రయాణం చేసినంతసేపూ బాబాయి బండి వాణ్ణి నానా మాటలూ అన్నాడు. గతుకుల్లో పడ్డ ప్పుడు నడుములు విరిగాయనీ, గూళ్ళు తొలగా యనీ, మూడు బ్రద్దలైందనీ గోలెట్టాడు. "ఇది బండికాదు. నన్ను స్మశానానికి తీసికెళ్తూన్న పాడె" అన్నాడు.

"బాబాయ్— మరీ సౌఖ్యంగా ప్రయాణం చేసేందుకు ఇది ఎడ్లబండి కాని ఎంబాసిడర్ కారు గాదు. ఇంకా గోలెట్టావంటే ఎద్దులు బెదిరి అడుగు ముందుకు వెయ్యవు. అంతేకాదు. బండి వాడు కోపగించి తిరుగు ప్రయాణంలో మనల్ని వదలి మరో బాడుగకుదుర్చుకోవచ్చు" అన్నాను రహస్యంగా.

వృశ్చిక మాంత్రికుడు

దాంతో బాబాయి తిక్క కుదిరింది. ఎంతటి కుదుపునైనా తమాయించుకుని బాధను, కోపాన్ని మాటల్లోకి తర్జుమా చెయ్యకుండా కళ్ళతో నన్ను మ్రింగడం మొదలెట్టాడు.

సముద్ర ఘోష స్పష్టంగా వినిపిస్తూంది. ఎంతో మంది జనం మా బండి కటూ ఇటూ కాలినడకనే వెడుతున్నారు. ఇంకా అరమైలు దూరం ఉందనగానే బాబాయిలో భయం, ఆందో ళన మరీ ఎక్కువయ్యాయి. సముద్రం మోత ఆయనకు రణరంగంలోనికి ఫిరంగులు తటఘ్నుల మోతగానూ, అప్పటికే అక్కడ చేరిన ప్రజల కేకలూ, కేరింతలూ ఆయనకు శత్రు మూకల వికటాట్టహాసాలుగానూ వినిపించ సాగాయి.

సముద్రుడు గంభీరంగా నీలిమ వర్ణంతో, ఉవ్వెత్తున కెరటాలు లేచి పడుతూండగా విశ్వ వ్యాప్తంగా కనుపిస్తున్నాడు. సూర్య గ్రహణ పర్వసమయాన తమతమ పాపాలను సముద్ర గర్భంలో ప్రక్షాళితం చేసుకుందుకు విచ్చేసిన వేలాది ప్రజలతో తీరం నిండి పోయింది.

ఇసుకలో నడిపించి బాబాయిని ఒడ్డుకు పోయాను. అప్పటికే స్వాములవారు స్నానం చేసి జపం చేసుకుంటున్నారు. బాబాయి శరీరానికున్న కవచం వగైరా తొడుగులను తీయమన్నాను.

ససేమిరా వీల్లేదన్నాడు. "నన్ను దీంట్లో ముంచి, నాకు న్యూమోనియా జ్వరం తెప్పించి, నా లక్ష్మికి వైధవ్యాన్ని తెప్పించేందుకే నువ్వీ పన్నాగం పన్నావు." అన్నాడు.

"బాబాయ్— మరో పది నిమిషాల్లో నీకు మంత్రోపదేశం జరుగుతుంది. ఆ తర్వాత సర్ప వృశ్చికాది జంతువుల విషంతో బాధపడే వారిని నీ నోటివాక్కుతో, నీ కంటి చూపుతో బాధా రహితులను చేసి పంపుతూంటే వారు అనుభ వించే ఆనందం నిన్ను ముగ్ధుణ్ణి చేస్తుంది. వారి ఆశీస్సులు నీకు లభ్య మవుతాయి. అంతకంటె మించిన మానవసేవ మరిలేదు. మృత్యు ముఖం నుంచి రక్షింప బడ్డ మానవుడు నీకు తెలిపే కృత జ్ఞత కంటే పదవులూ, బిరుదులూ ఎక్కువ కాదు. చూడు వృద్ధులూ—స్త్రీలూ ఎలా స్నానాలు చేస్తున్నారో ? వారందరి ప్రాణాల మీద తీపి లేకనే అలా సముద్రంలోకి దిగుతున్నారంటావా? ధైర్యం చెయ్యి— వచ్చి స్నానం చెయ్యి ! మంత్రోప దేశం చేసుకుని మానవసేవ చెయ్యి. అదే మానవ సేవ ! అలాంటి సేవ చేసి నీవు అజరామరమైన కీర్తివంతుడివి కావాలంటే నువ్వీ త్యాగం చేయాలి బాబాయ్— తప్పదు."

కౌరవ సేనా వాహినిని గాంచి, బెదరి, శత్రువుకు వెన్ను చూపి కదనరంగం నుంచి పరుగు తీసిన తీసిన ఉత్తర కుమారుడికి అర్జునుడు ధైర్యం చెప్పి యుద్ధోన్ముఖుణ్ణి చేసినంత పనయింది నాకు బాబాయిని స్నానోన్ముఖుణ్ణి చేసేటప్పటికి !

సముద్ర స్నానం కాస్త నెలకువతో, కెరటా లతో ఆడుకుంటూ చేస్తే ఎంతో హాయిగా ఉంటుంది. కెరటం రాగానే బాబాయి దాన్తో పాటు ఎగరనూలేడు. పోనీ తలను క్రిందికి దించ డమూ చేతగాడు. అలాంటప్పుడు అలలోగూడా వివరిపోయిపడి మళ్ళీ తన క్రింద నున్న ఇసుకతో సహా అలలోపలికి వెళ్ళేప్పుడు బాబాయి చేసే హంగామా, అల్లరీ, తిట్లూ నలుగుర్నీ ఆకర్షిం చేట్టు చేశాయి. రెండు మూడు నిమిషాల్లో బాబాయి స్నానం అయిందనిపించుకున్నాడు.

బాబాయి పొడి గుడ్డలు కట్టుకుంటా నని మారాంచేశాడు. కాని స్వాములవారు అంగీకరించ లేదు. మంత్రోపదేశం జరిగేప్పుడు తడి, మడి అవసరం అన్నాడు. సముద్రానికి అభిముఖంగా కూర్చున్నాడు బాబాయి గడగడ వణకుతూ.

"నాయనా, సర్పమంత్రమా — వృశ్చిక మంత్రమా—ఏది కావాలి ? పాము మంత్రానికి కొన్ని నియమాలు పాటించాలి. భోజనం చేసే సమయంలో 'పాము' అన్న శబ్దం వినరాదు. ఒక వేళ విన్నావో, అంతటితో భోజనం వదలి లేవా ల్సిందే ! కొన్ని కాయగూరలు గూడ నిషిద్ధములే! మంచానికి అడ్డంగా పడుకోరాదు. మైలపడ్డ వారిని స్పృశించరాదు. ఎట్టి సమయంలోనూ సర్పానికి హాని కలిగించరాదు. ఈ నియమాలు పాటించకున్న ఈ శ్రమంతా వృథా ! కాని తేలు మంత్రానికి నియమాలేవీ లేవు." అన్నాడు స్వాముల వారు.

"అయితే ఆ తేలు మంత్రమే ఉపదేశించండి స్వామీ" వెంటనే అందుకున్నాడు బాబాయి.

నిజమే. బాబాయి భోజన ప్రియుడు. ఈ విషయాన్ని కనిపెట్టి ఏ కొంటెకాయైనా ఆయన్ని తిండి తిననీయకుండా ఏడ్పించవచ్చు ! ముఖ్యంగా సర్పానికి హానికలిగించకుండా ఉండడం దుర్లభం. స్వయంగా పామును కొట్టి చంపగల ధైర్యం బాబాయికి లేదు. కాని ఎవరితోనైనా చెప్పి చంపించవచ్చు. అప్పుడు నియమోల్లంఘన జరుగుతుంది. అందుకనే బాబాయి తేలు మంత్రం కోరుకున్నాడు. అయినా పరవాలేదు. వేసవి కాలంలో చేతినిండా పని ! అసలు ఆ వూళ్ళో అను

దినమూ కప్పుల్లోంచి తేళ్ళు అనేకం రాలుతుంటాయి. వాటిలో కొన్ని అయినా మనుషులను కుట్టకుండా పోవు. వాళ్ళ బాబాయి పొలసడకుండా డానూ పోరు !

మంత్రోపదేశం జరగ బోతోంది. స్వాముల వారు నన్ను దూరంగా వెళ్ళమన్నారు. బాబాయి నమస్కారం చేశాడు. ముక్కు పట్టుకున్నాడు. ఏవో సైగల్లాంటివి అనేకం చేశాడు. స్వాముల వారు చెవిలో ఏదో చెప్పి బాబాయి చేత పలికించాడు. పదేపదే ఆ మాటలు స్వాములవారు చెప్పగా బాబాయి పలుకుతున్నాడు. కదలని బస్సును నెట్టిన ప్రయాణీకులు బస్సు స్టార్టవంగానే మళ్ళీ ఆగుతుందేమోనన్న అనుమానంతో వెనక కాసేపు నిలిచి నట్టుగా ఆగాడు స్వాములవారు. కాని బాబాయికి నాలుక కాస్త మందం. సంస్కృత పదాలు ఆయన ఉచ్చరించేందుకు కాస్త పరిశ్రమ అవసరం. అందులోనూ తడి బట్టలలో, చలితో గడగడ వణకుతూ మాటలు సరిగా రావడంలేదు గాబోలు స్వాములవారు మధ్యమధ్యలో సాయం చేస్తూ పలికిస్తున్నాడు. ఆ విధంగా నూట ఎని మిదిసార్లు జపించిన మీదట ఇక అయిపోయిందని లేవ బోయాడు బాబాయి. కాని స్వాములవారు లేవ నివ్వలేదు. గ్రహణ కాలం పూర్తయేవరకూ అలా జపిస్తూ కూర్చోమన్నాడు.

"రోజూ శక్త్యానుసారం ఈ విధంగా జపించు. ఏ వేళనైనా ప్రజలకు సేవచెయ్యి నాయనా. సర్వే జనాస్సుఖినోభవంతు" అన్నాడు స్వాముల వారు.

నట్టరాని ఆగ్రహంతో బాబాయి స్వాముల వారి నేమీ అనలేక అల్లంత దూరాన కూర్చున్న నాకేసి ఉరిమి చూచాడు.

ఇక గత్యంతరం లేక మరో రెండు గంటలకాలం అలా ఇసుకలో కూర్చుని జపంచేశాడు. లేచేప్పుడు స్వాములవారు మంత్రం వెయ్యవలసిన విధానం, వచ్చిన వాళ్ళను నడిపించడం, చేతులు కాళ్ళు విదిలించడం మొదలైన తతంగమంతా బోధించి దీవించాడు. బాబాయి కడపట స్వాములవారికి సాష్టాంగ పడ్డాడు.

సాయంకాలానికి చచ్చీ చెడి ఇంటికి చేరుకునే ప్పటికి బాబాయి రైళ్ళు లేని కాలంలో కాశీ యాత్ర చేసి తిరిగొచ్చిన వాడిలా అయిపోయాడు. బండి ఆగిన చప్పుడు విని వీధి వాకిట్లోనే నుమ్మళ్ళి నిలవేసి పళ్ళెంలో ఎర్రనీళ్ళు తెచ్చి దిష్టి తీసింది బామ్మ. ఆ తర్వాత బాబాయి అమ్మను కుశల ప్రశ్నలు వేశాడు. ఆమె ఆరోగ్యం ఎలా ఉందో కనుక్కున్నాడు. మామగారినుంచి ఉత్తరం వచ్చిందా అని అడిగాడు. గురవయ్య ధాన్యం విషయం ఏమన్నాడో తెలుసుకున్నాడు. ఎంతో కాలం నిద్ర పోయిన రిప్‌వాన్ వింకిల్ గూడా నిద్రలేవగానే అలా ప్రవర్తించి ఉండడేమో !

నాకూ వళ్ళంతా నొప్పులుగా ఉంది. మనసుకు ఇప్పుడు కాస్త విశ్రాంతి దొరికింది. బాబాయికి తేలిగ్గా, ఖర్చులేకుండా పేరు రావడానికి ఒక మనిషి ఎంతైతే చేయగలడో అంతా నా లోపం లేకుండా చేశాను. ఇక మిగిలింది బాబాయి కృషి మాత్రమే! భోంచేసి పడుకోగానే హాయిగా నిద్ర వచ్చేసింది.

బాబాయికి కొంచెమైనా వేసులుబాటు లేకుండా ఉంది. ఇంటి ముందు వో ఎనామిల్ బోర్డు "డి. పశుపతి— వృశ్చిక మాంత్రికుడు" అని ఉంది. హాల్లో పెలిపోను, ప్రక్కన పెద్ద సోఫా. సోఫాలో బాబాయి. మెలిత్రిప్పిన మీసాలు. నుదుట కుంకుమ బొట్టు. వరండాలో క్యూలో జనం 'లబ్బో, అమ్మో' అని మూలుగుతున్నారు. భుజం మీది తువ్వాలు కొనను మెలిపేస్తూ, వచ్చిన వాళ్ళను ముందుకీ వెనక్కీ నడిపిస్తూ, 'ఫో' అని బెదిరిస్తూ, కాళ్ళు చేతులూ విదిలిం పిస్తూ పంపేస్తున్నాడు.

తపాలా బంట్రోతు తెచ్చిన కవరును చింపి చూచాడు. ఢిల్లీలో జరగబోయే అఖిల భారత వృశ్చిక మాంత్రికుల మహాసభకు తనని అధ్యక్షత వహించమని కోరుతూ ఆహ్వానం బాబాయి విలువ పెరిగి పోయింది. కీర్తి వచ్చింది. అనేక సంఘాలు ఆయన్ని సన్మానించాయి. ఆయన చేస్తూన్న నిస్వార్థ సేవను గురించి పత్రికలు పొగిడాయి. విదేశీయులు ఆయన మంత్ర ప్రభా వాన్ని గుర్తించి వారివారి దేశాలకు ఆహ్వానించారు.

ఉన్నట్టుండి, ఇంటికప్పు ఎగిరి పోయేట్టు, కోష్టంలో గొడ్లు బెదురుకునేట్టు, చెట్టు మీది పక్షిజాలం అదిరి పడేట్టు ఓ గావు కేక వినిపిం చింది. కల చెరిగి పోయింది. గదిలోంచి హాల్లోకి పరుగెత్తాను.

బాబాయి పడి మంచం మీద కూర్చుని ఎడమ కాలి బొటన వ్రేలును గట్టిగా పట్టుకుని వణికి పోతున్నాడు. బామ్మ లాందరు చేత్తో పట్టుకుని మంచం క్రింద అతిజాగ్రత్తగా వెతుకుతూంది. నిలువెల్లా వణికి పోతూన్న బాబాయి మళ్ళీ ఓ గావుకేక పెట్టి చూపుడు వ్రేలుతో గడపవైపు చూపుతూ ముఖాన్ని వెనక్కి తిప్పుకున్నాడు. ఎర్రటి గుడ్లతో, కొండెను పైకి ఎత్తి, సవిలాసంగా మహారాజువారి ఎదుట నాట్యం చెయ్యబోయే రాజనర్తకిలా మెల్లగా అడుగులో అడుగు వేసు కుంటూ, వయ్యారంగా, హొయలు ఒలక బోస్తూ వెళ్తోంది వో వృశ్చిక రాజం ! వెంటనే బాబాయి ఏదో తట్టిన వాడిలా అంత బాధలోనూ కోడి— కోడి— కోడి అని అరవడం ప్రారంభిం చాడు.

"ఇది కోడి గాదు బాబాయ్— తేలు— సరే— ఇక మంచం దిగి మంత్రం వేసుకో. మొదటి కేసు స్వయం కేసు." అన్నాను సాదరక్షతో వృశ్చిక వధగావిస్తూ.

బాబాయి మంచం దిగాడు. అయితే మంత్రం మరచిపోయినట్టున్నాడు. సుమారు రెండు గంటల సేపు జపించిన మంత్రం, ఇంత త్వరగా మరచిపోతానని ముందే తెలుసుకొన్నాడు గాబోలు. బాబాయి బండిలో కెక్కుతూనే ఆ మంత్రాన్ని డైరీలో కెక్కించేశాడు.

డైరీ చేతికి తీసుకుని తువ్వాలు కొనను మెలిబెడుతూ, తానటూ ఇటూ తిరుగుతూ, నోట్లోనే మంత్రోచ్చాటన గాలిస్తూ, అప్పు డప్పుడూ ఫో—ఫో అంటూ కసురుకుంటూ, రోగిగానూ, వైద్యుడుగానూ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు బాబాయి.

ఎన్నిసార్లు అటూ ఇటూ తిరిగినా, ఎంత సేపు 'ఫో' అన్నా ఆ విషం దిగినట్టు లేదు. బాధ ఉపశమించినట్టు లేదు. తేలు బాధకన్నా, తన మంత్రం పారలేదన్న బాధ ఎక్కువై పోయింది. రోజంతా ఒళ్ళు హూనం చేసుకుని, ఉప్పునీళ్ళలో మునిగి, హోరుగాలిలో కూలబడి, చెప్పిన మాటే వెయ్యి సార్లు చెప్పిన శ్రమంతా మళ్ళీ తన కళ్ళెదుట సాక్షాత్కరింపజేస్తున్నట్టయింది !

అయినా ఇది మొదటి కేసు. దీన్లోనే అపజయం పొందినట్టు ప్రజానీకానికి తెలిస్తే మళ్ళీ తన ముఖం ఎవరూ చూడరు. అందుకని బాధ తగ్గి పోయిందన్నాడు బాబాయి పళ్ళు బిగపట్టుకుంటూ.

నాకేమో అనుమానంగానే ఉంది. బామ్మ మాత్రం సంతోషించింది కుమార రత్నం ప్రయోజ కత్వానికి. నేను గదిలోకెళ్ళి అలా నడుం వాల్చానో లేదో, బలవంతంగా మూసి పెట్టిన కుళాయి సీటిని పైకి చిమ్మినట్టు, బాబాయి గొంతు పెకి లించుకు వచ్చింది భోరుమని ఏడుపు.' వెంటనే జతగా బామ్మ మరి కాస్త ఎక్కువ శృతిలో లంకించు కుంది.

ఆ శోక స్వర కర్తల నిద్దరినీ చూస్తూంటే అసలు తేలుకుట్టింది బాబాయినా, లేక బామ్మనా, లేక ఇద్దరినీనా అన్నది అర్థంగాదు క్రొత్తవాళ్ళకి.

బాబాయికి పేరు సంపాదించి పెట్టేందుకు హారం వేసుకున్న నేను ఇప్పుడు పెద్ద చిక్కులోనే ఇరుక్కున్నాను.

బాబాయేమో థర్మామీటర్లో పాదరసం లాగా గుండెల్లోకి విషం ఎక్కిపోతూందంటున్నాడు. బామ్మ నన్నో హంతకుణ్ణి చూచినట్టు చూస్తూంది.

మంత్రసాని పనికి ఒప్పుకున్న తర్వాత దేనికైనా సిద్ధ పడాల్సిందేగదా మరి ! ఏళ్ళనిద్దరినీ ఓదార్చ బోతే కంఠస్వరాలు మరికాస్త హెచ్చుస్థాయిలో జమిలిగా, జంటనాదస్వరాల్లాగా పలుకుతున్నాయి. ఒక క్షణం పూరుకున్న బాబాయి మరుక్షణంలో ఎడమ పాదాన్ని ఎత్తి పట్టుకుని కుడికాలు మీద హాలులో ఒక మూల నుంచి మరొక మూలకు ఎగి రెగిరి దుముకుతూ తాండవ నృత్యం చేస్తున్నాడు.

నాకేటూ తోచడంలేదు. పాత గ్రామఫోను ప్లేటు అరగదీసి పట్టువేశాను. తగ్గలేదు. పేరుల్లిపాయలు చితగొట్టి కట్టాను. తగ్గలేదు. తీరా నేను తేలుకుట్టిన చోట గాక వేరే చోట మందులు వేశానని నా మీదికి ఉరిమాడు. అప్ప టికి ఈ సంగీతకచేరీకి ఇంటి నిండా శ్రోతలు చేరారు.

ఇక నేనేమీ చేయలేను. ఏం చేసినా అది చెడుగానే పరిణమించేట్టున్నది. ఇంకేదైనా కీడు జరిగినా ఆ నింద నా మీదికే వస్తుంది. లాందరు చేత్తో పుచ్చుకుని ఆ నట్టు నడిరాత్రి మూడు మైళ్ళ గూరాన ఆశ్రమంలో ఉన్న స్వాములవారి కోసం పరుగు తీశాను.

మర్నాటి ఉదయానికి బాబాయి వృశ్చిక మంత్రోపదేశోదంతం వూళ్ళో వాళ్ళకి తెలిసిపోయింది. అప్పట్నుంచీ ఆయనకు వి. యస్. అన్న పేరు వచ్చింది. అంటే విలేజ్ మున్సిఫ్ మాత్రం కాదు.